సాక్షి నిర్మల్

బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



అవార్డుల ఆస్పత్రి 10లో▸

నిర్మల్ రూరల్ మండలం పరిధిలోని ముజ్గి పీహెచ్‌సీకి కేంద్రం 2022 సంవత్సరానికి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్వాస్) ధ్రువీకరణ పత్రం ప్రకటించింది.



ఆర్జీయూకేటీలో అకడమిక్స్‌పై సమీక్ష

బాసర ఆర్జీయూకేటీ కాన్ఫరెన్స్ హాల్‌లో అకడమిక్స్‌పై అధ్యాపకులతో డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్ కుమార్, ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ మంగళవారం సమీక్ష నిర్వహించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.2/16.7

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది. చలి ప్రభావం తగ్గుతుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు మంత్రి హరీశ్‌రావు రాక

నిర్మల్:రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు బుధవారం నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు రానున్నారు. జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 8.45 గంటలకు నిర్మల్‌కు చేరుకుంటారు. ఉదయం 9.15 గంటలకు ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సిటీస్కాన్ యంత్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తారు. తర్వాత 11 గంటలకు బోథ్ చేరుకుంటారు. అక్కడ 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతారు.

డైస్‌లో కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాల భర్తీ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్ పద్ధతిలో డైస్ సెంటర్‌లో వివిధ పోస్టులు భర్తీ చేయుటకు నోటిఫికేషన్ (నం.70/2023, తేదీ:20.02.2023) విడుదల చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ తెలిపారు. ఆయా విభాగాలలో అర్హత కల్గిన అభ్యర్థులు దరఖాస్తులను వెబ్‌సైట్ nirmal.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకుని అర్హత పత్రాలు జతచేసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యలయంలో ఇవ్వాలని వివరించారు. దరఖాస్తుకు ఈనెల 27 వరకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు.

వేణుగోపాలచారిని కలిసిన మురళీధర్‌రెడ్డి




వేణుగోపాలచారిని సత్కరిస్తున్న మురళీధర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమితులై తొలిసారి నిర్మల్ జిల్లా పర్యటనకు వచ్చిన డాక్టర్ ఎస్.వేణుగోపాలచారిని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తమ్ముడు ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి మంగళవారం కలిశారు. జిల్లా కేంద్రంలోని ఐబీలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్రామిరెడ్డి, వంగ రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గిరిజన క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి 28న ఎంపిక పోటీలు

నిర్మల్ రూరల్: గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 28న ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సౌజన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతూ 2023, ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 ఏళ్లలోపు వయసు కలిగిన అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న గిరిజన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. వీరికి ఎత్తు, బరువు, 30 మీటర్ల పరుగు పందెం, స్టాండింగ్ బ్రాండ్ జంప్, వర్టికల్ జంప్, 800 మీటర్ల పరుగు పందెం తదితర శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి హైదరాబాద్, ఉట్నూర్(బాల, బాలికలు), జాతర్ల (బాలుర) పాఠశాలలో ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో అత్యుత్తమ విద్యాబోధన, క్రీడా శిక్షణ, పౌష్టికాహారం, క్రీడా సామగ్రితోపాటు అన్ని వసతులు ఉంటాయని వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో పోటీలకు హాజరు కావాలని సూచించారు.

అర్హులకే డబుల్ బెడ్రూం ఇళ్లు



సర్వేలో అదనపు కలెక్టర్ రాంబాబు

కడెం: అర్హులకే డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. కడెం, కన్నాపూర్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన డబుల్ బెడ్రూం ఇళ్ల సర్వేలో పాల్గొన్నారు. పెద్దూర్ శివారులో నిర్మించిన ఇళ్లను కడెం, కన్నాపూర్ గ్రామాలకు చెందిన అర్హులకు కేటాయిస్తామని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య, స్థానికులు ఉన్నారు.



గుంపుగా తిరుగుతున్న కుక్కలు



భౌ బోయ్..!

ఈ ఫొటోలోని మూడేళ్ల చిన్నారి పేరు యశ్వంత్. సారంగాపూర్ మండలం జౌళి గ్రామానికి చెందిన ఈ చిన్నారి ఇటీవల ఇంటి బయట ఆడుకుంటుండగా వీధికుక్కలు సామూహికంగా దాడిచేశాయి. నోట కరుచుకుని కొంతదూరం లాక్కెళ్లాయి. బాబు ఏడుపు విని తల్లి బయటకు రావడంతో కుక్కలు వదిలేసి పారిపోయాయి. తల్లి బయటకు రాకుంటే నేడు హైదరాబాద్‌లోని అంబర్‌పేట తరహాలోనే విషాదమే మిగిలేది.

- జిల్లాలోనూ రెచ్చిపోతున్న వీధి కుక్కలు
- గుంపులుగా సంచరిస్తూ.. పిల్లలపై ప్రతాపం
- సామూహికంగా గొర్రెలు, మేకల మందపై దాడులు

నిర్మల్: ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చిన నాలుగేళ్ల చిన్నోడిని గుంపుగా వచ్చిన కుక్కలు దాడిచేసి చంపాయి. 'అమ్మా.. అమ్మా..'అంటూ ఎంత ఏడ్చినా విడవకుండా దారుణంగా చంపేశాయి. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో జరిగిన ఈ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఈ దారుణాన్ని చూసిన ప్రతీఒక్కరూ 'అయ్యోపాపం..' అంటున్నారు. అంతేకాదు.. కుక్కలను చూస్తేనే 'భౌబోయ్' అంటున్నారు. తమ పిల్లలను ఆడుకోవడానికి ఇంటి బయటకు పంపడానికి కూడా తల్లిదండ్రులు జంకుతున్నారు. జిల్లాలోనూ కుక్కల దాడులు తరచూ జరుగుతుండడమే ఇందుకు కారణం. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడే సంబంధిత అధికారులు స్పందిస్తున్నారు.

జిల్లాలోనూ..

చిన్నపిల్లలపై వీధికుక్కలు కుక్కలు దాడులు చేస్తున్న ఘటనలు జిల్లాలోనూ చోటుచేసుకుంటున్నాయి. సారంగపూర్ మండలం జౌళిలో ఇటీవల యశ్వంత్ అనే బాలుడిపై ఇటీవల దాడిచేయగా, ఖానాపూర్ మున్సిపాలిటీలో వీధికుక్కలు చిన్నారులతోపాటు పెద్దలపైనా తరచూ దాడులు చేస్తున్నాయి. లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లీ, పంచగుడి, ధర్మోర, రాజూరా, పిప్రి, వట్టోలి, అర్లి–గొడిసెర, జోహర్‌పూర్, లోకేశ్వరం, పుస్పూర్ తదితర గ్రామాల్లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలతోపాటు పశువులపైనా దాడులు చేస్తున్నాయి. రాయపూర్‌కాండ్లి, పిప్రిలో గొర్రెలను చంపేశాయి. జిల్లాకేంద్రంలోని పలు వీధుల్లోనూ కుక్కల బెడద ఉంది. ప్రధానంగా రాత్రివేళల్లో గుంపులుగా వస్తూ భయపెడుతున్నాయి.

చిన్నారులు జాగ్రత్తా..!

హైదరాబాద్‌లో కుక్కల దాడిలో చిన్నారి చనిపోయిన ఘటన అందరినీ కలచివేస్తోంది. ఇదే సమయంలో తమ పిల్లలను ఒంటరిగా బయటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి కల్పించింది. కుక్కకాటుకు మందులు ఉన్నా.. అవి విచక్షణారహితంగా దాడిచేస్తే ప్రాణాలు దక్కే అవకాశాలు తక్కువే. ఇలాంటి ఘటనల నేపథ్యంలో చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపడం సరికాదన్న వాదన వస్తోంది. సంబంధిత పంచాయతీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కూడా తరచూ కుక్కలపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు. పెంపుడు కుక్కలకు యజమానులు సకాలంలో ఇంజెక్షన్లు ఇప్పించడం, వాటిని అదుపులో పెట్టుకోవడం చేయాల్సిన అవసరం ఉంది.



లోకేశ్వరం మండలం రాయపూర్‌కాండ్లిలో కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు(ఫైల్)

మళ్లీ చర్యలు తీసుకుంటాం..

గతంలో నిర్మల్ మున్సిపల్ పరిధిలో కుక్కలను పట్టించి, దూరప్రాంతాల్లో వదిలేశాం. తాజా ఘటనల నేపథ్యంలో మరోసారి కుక్కలను పట్టి తరలించేవాళ్లను రప్పించే చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపించొద్దు.

– దేవదాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నిర్మల్ మున్సిపాలిటీ

పెద్దాస్పత్రిలో కార్పొరేట్ వైద్యం

- ఒక్కొక్కటిగా సమకూరుతున్న ఆధునిక యంత్రాలు
- నేడు హరీశ్‌రావు చేతుల మీదుగా సిటీ స్కాన్ ప్రారంభం
- త్వరలో అందుబాటులోకి రేడియాలజీ సేవలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రి మెరుగైన వైద్యసేవల్లో మేటిగా నిలుస్తోంది. హైదరాబాద్, నిజామాబాద్ తర్వాత జిల్లా ఆస్పత్రిలోనే దాదాపు అన్ని విభాగాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందుతోంది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సూపర్ స్పెషాలిటీ తరహాలో ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుండడం విశేషం. జిల్లా కేంద్రంలో 100 పడకలతో ప్రారంభమైన ఆస్పత్రి ప్రస్తుతం మెడికల్ కాలేజీ స్థాయికి చేరుకుంది. గతంలో నిత్యం 400 నుంచి 500 మంది వరకు చికిత్స కోసం రాగా, ఆ సంఖ్య ఇప్పుడు 800 నుంచి 900 వరకు పెరిగింది. జిల్లా నుంచే కాకుండా సరిహద్దు పొరుగు జిల్లాలు, మహారాష్ట్ర నుంచి కూడా వైద్యం కోసం నిర్మల్ సర్కార్ ఆస్పత్రికి వస్తున్నారు.

గతంలో కొన్ని మాత్రమే

పెద్దాస్పత్రిలో గతంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థో, డెర్మటాలజీ, కంటి వైద్యం మాత్రమే అందేది. ఇప్పుడిప్పుడే ప్రత్యేక విభాగాలు ఒక్కటొక్కటిగా మొదలవుతున్నాయి. దీంతో ఆధునిక వైద్యం అందుతుండగా, ఆస్పత్రికి వచ్చే వారికి పైసా ఖర్చు లేకుండా రోగ నిర్ధారణ పరీక్షలు కూడా చేస్తున్నారు.

అందుబాటులోకి సిటీ స్కాన్


గతేడాది రిలయన్స్ గ్రూప్ సంస్థ జిల్లా ఆసుపత్రికి రూ.1.50 కోట్లతో సిటీ స్కాన్ యంత్రాన్ని అందించింది. దీనిని బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించి సేవలను రోగులకు అందుబాటులోకి తేనున్నారు.

తక్కువ ఖర్చుతో పలు రకాల పరీక్షలు..

జిల్లా ఆస్పత్రిలో పలురాకాల పరీక్షలు తక్కువ ఖర్చుతో పేదలకు అందనున్నాయి. 3డీ స్కాన్, యాంజియో, హెచ్ ఆర్సీటీ, సీటీ బ్రెయిన్, పీఎన్‌ఎస్, ఆర్బిటీ, టెంపోరల్ బోన్స్, అబ్డామిన్, పెల్విస్, నీజాయింట్స్, స్పైనల్ కార్డ్ తదితర స్కానింగ్‌లు ఆస్పత్రిలోనే చేస్తారు.

త్వరలో రేడియాలజీ సేవలు...

జిల్లా ఆసుపత్రిలో ప్రస్తుతం డయాగ్నోస్టిక్ సేవలు, డయాలసిస్ సేవలు అందుతున్నాయి. దీనికి తోడు సిటీ స్కాన్ సేవలు కూడా అందుబాటులో రావడంతో పేద ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు తొలగనున్నాయి. త్వరలో రేడియాలజీ సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. దీనికోసం ఆసుపత్రి ప్రాంగణంలో భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. రేడియాలజీ సేవలకు సంబంధించి మిషనరీ కూడా ఒక్కొక్కటిగా సమకూర్చుకుంటున్నారు. త్వరలో ఈ సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి.



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ యంత్రం

సమస్యలూ ఉన్నాయి...

- స్వయంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు గత పర్యటనలో నార్మల్ డెలివరీలు పెంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. కానీ, సిజేరియన్లు ఏమాత్రం తగ్గలేదు. ఇటీవల జిల్లాకు వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ శ్వేత మహంతి సైతం జిల్లాలో సిజేరియన్ల సంఖ్య అధికంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయినా చాలావరకు ఏరియా ఆసుపత్రి సౌకర్యాలే కొనసాగుతున్నాయి. ఆస్పత్రికి ఒకటే గేటు ఉండటం కూడా ఎమర్జెన్సీ వాహనాలకు అసౌకర్యం ఏర్పడుతోంది.
- మెడికల్ కాలేజీ మంజూరైనా.. ప్రిన్సిపాల్ మాత్రం ఇప్పటికీ బాధ్యతలు తీసుకోకపోవడం కలవరపెడుతోంది.
- జిల్లా ఆసుపత్రితోపాటు భైంసా, ఖానాపూర్ ఆసుపత్రులలో కూడా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. నర్సాపూర్ ఆసుపత్రితోపాటు పలు పీహెచ్‌సీలలో పూర్తిస్థాయిలో ప్రసవాలు చేయడం లేదు.

పేదలకు అత్యాధునిక వైద్యం

జిల్లా ఆస్పత్రిలో ఇప్పటికే ప్రజలకు అన్నిరకాల వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నాం. అత్యాధునిక వ్యాధి నిర్ధారణ యంత్రాలు కూడా కేటాయించటంతో పేదలు పరీక్షల కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేదు. సిటీ స్కాన్ సేవలు అందుబాటులోకి రావడంతో అతి తక్కువ ధరలకే పరీక్షలు అందుతాయి.– డాక్టర్ దేవేందర్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్

రోడ్డుపై మహిళ ప్రసవించడమే బంగారు తెలంగాణా?

పెంబి: అటవీ ప్రాంతంలో అర్ధరాత్రి నడి రోడ్డుపై మహిళ ప్రసవించడమే బంగారు తెలంగాణా అని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ ప్రశ్నించారు. మండలంలోని దొందారి గ్రామానికి చెందిన సీడం సునీత ఆ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎడ్ల బండిలో తీసుకువచ్చే క్రమంలో దట్టమైన అటవీ ప్రాంతంలో నడిరోడ్డుపై ప్రసవించింది. ఈ విషయం తెలుసుకున్న వినోద్‌నాయక్ మంగళవాం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారు తెలంగాణలో ఎయిర్ అంబులెన్సు ఏర్పాటు చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఆవిషయం మర్చిపోయారన్నారు. తాను మాత్రం రూ.వంద కోట్లు పెట్టి విమానం కొనుగోలు చేశాడని పేర్కొన్నారు. ఆదివాసీ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే ఇప్పటి వరకు బాధితురాలిని పరామర్శించకపోవడం సిగ్గుచేటన్నారు. బాధితురాలికి నిత్యావసర సరుకులు అందించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, నాయకులు తులాల శంకర్, వసంత్‌రావు, మల్లేపల్లి స్వామి, గంగాధర్, రాజునాయక్, రాజన్న, వినోద్, లక్ష్మణ్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



బాధిత మహిళను పరామర్శిస్తున్న వినోద్‌నాయక్, నాయకులు

సాగునీటి పథకాలను వినియోగంలోకి తెస్తాం

- ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి

భైంసాటౌన్: జిల్లాలో సాగునీటి సౌకర్యం లేని భూములకు నీరందించేలా కృషి చేస్తామని, వృథాగా ఉన్న వివిధ సాగునీటి పథకాలను వినియోగంలోకి తీసుకొస్తామని ఐడీసీ చైర్మన్ ఎస్.వేణుగోపాలాచారి అన్నారు. భైంసా ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో చేపట్టిన డీ 27, డీ 28 పనుల్లో వివిధ కారణాలతో జాప్యం జరుగుతోందన్నారు. పనుల విలువను సవరించి తిరిగి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. ఎనిమిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రైతుబంధు, రైతుబీమా, రైతులకు 24 గంటల ఉచితవిద్యుత్ వంటి సంక్షేమ పథకాలతో తెలంగాణ మోడల్‌గా నిలిచిందన్నారు. దేశమంతా ఒకే రకమైన అభివృద్ధి ఫలాలు అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ నినాదంతో కేంద్రంలో అధికారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని వివరించారు. అధికారంలోకి వస్తే రెండేళ్లలో దళితులందరికీ దళితబంధు అమలు చేస్తామని, దేశంలోని రైతులందరికీ 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న వేణుగోపాలచారి

సాగునీరందించాలని వినతి..

లోకేశ్వరం:మండలంలోని పిప్రి ఎత్తిపోతల పథకం నుంచి మండల కేంద్రంతోపాటు భాగాపూర్, పిప్రి గ్రామాల వ్యవసాయ భూములకు సర్వే ప్రకారం నీరందించాలని వీడీసీ సభ్యులు ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారికి వినతిపత్రం ఇచ్చారు. లోకేశ్వరం చెరువులోకి నీరందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వీడీసీ చైర్మన్ విజయ్‌రావు, ఎస్‌ఎంసీ చెర్మన్ రమేశ్, మచ్చేందర్ ఉన్నారు.

ఆహార భద్రత చట్టం పటిష్టంగా అమలు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లాలో ఆహార భద్రత చట్టం–2013 పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం చౌక ధరల దుకాణాల డీలర్లు, అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది చిత్త శుద్ధితో విధులు నిర్వహించి పేదలకు సక్రమంగా నిత్యావసర సరుకులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషక ఆహార పంపిణీ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ఆహార సలహా కమిషన్ సూచించిన అంశాల్లో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించి లోటుపాట్లను సరిదిద్దాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం విషయంలో ఐసీడీఎస్ సిబ్బంది కీలక బాధ్యత వహించాలన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1967లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, ఆర్డీవో స్రవంతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుమల్‌రెడ్డి

విద్యారంగం అభివృద్ధికి కృషి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- జామ్‌లో కేజీబీవీ నూతన భవనం ప్రారంభం

సారంగపూర్: విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలో రూ.2.05 కోట్లతో నిర్మించిన కస్తూరిబా కళాశాల నూతన భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. గతంలో పదో తరగతి వరకు చదువుకున్న పిల్లలను కళాశాలల్లో చేర్పించలేక ఎంతోమంది తల్లిదండ్రులు సతమమతమయ్యారని తెలిపారు. చాలావరకు ఆడపిల్లల చదువు మాన్పించి పెళ్లిళ్లు చేశారని పేర్కొన్నారు. స్వరాష్ట్ర సాధించుకున్నాక సీఎం కేసీఆర్ విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. గురుకులాలు, కస్తూరిబా పాఠశాలల స్థాయి పెంచి ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారని వెల్లడించారు. ప్రస్తుతం ప్రైవేటుకు దీటుగా గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో చదివే విద్యార్థులు రాష్ట్రస్థాయిలో గుర్తింపు సాధిస్తున్నారని వివరించారు.

అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలి..

గురుకులాల్లో చదువుకునే విద్యార్థు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఐఐటీ, ఎయిమ్స్, నీట్‌లో సీట్లు సాధించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. రాబోయే పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ మహిపాల్ మురళీకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఆలూరు, కౌట్ల(బి) పీఏసీఎస్ అధ్యక్షుడు మాణిక్ రెడ్డి, అయిర నారాయణరెడ్డి, అడెల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు అయిటి చందు, ఎంపీటీసీ మహిపాల్ వనజ, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో సరోజ, కేజీబీవీ ప్రత్యేకాధికారి అన్నపూర్ణ పాల్గొన్నారు.



కళాశాల భవనం ప్రారంభిస్తున్న మంత్రి, కలెక్టర్

50 ఏళ్లలో జరగని అభివృద్ధి 8 ఏళ్లలో చేశాం

లక్ష్మణచాంద: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 50 ఏళ్లలో జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తరువాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కేవలం 8 ఏళ్లలో చేసి చూపించామని రాష్ట్ర అటవీ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోన్ మండలం సిద్దులకుంట గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి మంగళవారం పాల్గొన్నారు. సిద్దుల కుంట గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించే సిద్దేశ్వర ఆలయ కల్యాణ మండపానికి, ఎస్టీ సంఘ భవనానికి భూమి పూజ చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన విశ్వబ్రాహ్మణ సంఘం భవనం, అంబేద్కర్ భవనం, గురడి రెడ్డి సంఘం షెడ్డును ప్రారంభించామన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం తరహాలో ఏమైనా అభివృద్ధి పనులు చేసిందా అని ప్రజలకు ప్రశ్నించారు. అందుకే దేశంలో బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఇటీవల మహారాష్ట్రలో నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభకు భారీగా జనం తరలిరావడమే ఇందుకు నిదర్శనమన్నారు. సిద్దులు కుంట గ్రామానికి ఇప్పటి వరకు ఏది అడిగినా ఇవ్వడం జరిగిందని, ఇక ముందు కూడా దేనికి నిధులు కావాలన్నా ఇస్తామని మంత్రి తెలిపారు. వచ్చే 5 ,6 నెలల్లో పాక్‌పట్లలో ఆయిల్ పాం ఫ్యాక్టరీ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. గ్రామంలో సీసీ రోడ్డు పనులకు రూ.50 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు అల్లోల మురళీధర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రెడ్డి సంఘ భవనం ప్రారంభిస్తున్న ఐకేరెడ్డి

సైన్స్‌తో సృజనాత్మకత పెంపు

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: సైన్స్ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందిస్తుందని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు మంగళవారం జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విద్యాశాఖ, ఫిజికల్ సైన్స్ ఫోరం సంయుక్తంగా జిల్లాకేంద్రంలోని నక్షత్ర హోటల్‌లో ఈ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సైన్స్ చాలా ఇష్టంతో చదవాలని సూచించారు. ఎందుకు? ఏమిటి? ఎలా? అని ప్రశ్నిస్తూ, సమాజాన్ని చదువుతూ మన మనసును సైన్స్‌తో ముడిపడే విధంగా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు భౌతిక రసాయన శాస్త్రాలు చాలా ఉపయోగపడతాయన్నారు. చిన్నప్పటి నుంచే వాటిపై ఇష్టం పెంచుకుని చదివితే నీట్, జేఈఈలో మంచి ర్యాంకులు సాధించవచ్చన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన విద్యార్థులకు మెమొంటో, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈనెల 24న రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు నిర్మల్ జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి పంపుతామన్నారు. ఇందులో జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, ఫోరం రాష్ట్ర బాధ్యులు కూన రమేశ్, జిల్లా బాధ్యులు దేవేందర్, వందన, రాజేశ్వర్‌రెడ్డి, రఫీక్, ఉర్దూ మాధ్యమ బాధ్యులు అన్సర్ హైమద్, ఇంతియాజ్ హైమద్, సెక్టోరియల్ అధికారులు రవిగౌడ్, ప్రవీణ్, నరసయ్య, శ్రీదేవి పాల్గొన్నారు.



విజేతలతో డీఈవో రవీందర్‌రెడ్డి ,ఉపాధ్యాయులు

జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేసిన హెల్త్ కమిషనర్

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. జిల్లా ప్రసూతి ఆస్పత్రి రికార్డులను కూడా జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చి పరిశీలించారు. దాదాపు 2 గంటలపాటు ఆయన ఏరియా ఆసుపత్రిలో ఉన్నారు. సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య


గోరేకర్ శ్యాంరావ్(ఫైల్)

భైంసాటౌన్: భార్య అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై ఎండీ గౌసుద్దీన్ వివరాల ప్రకారం... భైంసా మండలంలోని కుంబి గ్రామానికి చెందిన గోరేకర్ శ్యాంరావు (40) భార్య పద్మాబాయి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఈ నెల 16న ఆస్పత్రిలోని భార్యకు టిఫిన్ తీసుకువచ్చి బయటకు వెళ్లిన శ్యాంరావు తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం భైంసాలోని ఎస్‌ఆర్ గార్డెన్ సుద్దవాగు ఒడ్డు సమీపంలో కుళ్లిన స్థితిలోని మృతదేహం ఉందన్న సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కుటుంబీకులకు సమాచారమిచ్చారు. దీంతో వారు చేరుకుని మృతదేహం శ్యాంరావుదేనని గుర్తించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో సంఘటన స్థలంలోనే వైద్యులతో పోస్టుమార్టం చేయించారు. భార్య అనారోగ్యం, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


భీమన్న (ఫైల్)

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన పంబాల భీమన్న ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... క్షణికావేశంలో ఇంట్లో గొడవపడి రాత్రి 8.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు బంధువులతో పాటు తదితర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో భీమన్న కుమారుడు నితీష్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బేల: మండలంలోని పాటన్ గ్రామానికి చెందిన గోడే ప్రవీణ్(22) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం... గోడే మారోతికి ఏకైక కుమారుడు ప్రవీణ్ ఇంటర్ పూర్తిచేశాడు. ఏ పని లేకుండా తిరగడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ప్రవీణ్ సోమవారం రాత్రి క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్వినికి 'నాట్యనంది' పురస్కారం


పురస్కారం అందుకుంటున్న మనస్విని

నిర్మల్: జిల్లా కేంద్రానికి చెందిన చిన్నారి మనస్విని తన నాట్యంతో ఆకట్టుకోవడమే కాకుండా నాట్యసేవానంది పురస్కారాన్ని అందుకుంది. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌కు చెందిన బచ్చు కళ్యాణి, ప్రసాద్ దంపతుల కుమార్తె మనస్విని కూచిపూడిలో రాణిస్తోంది. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయగానసభలో శివోహం పేరిట నృత్యప్రదర్శన నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మనస్విని ప్రతిభ కనబర్చి నాట్యనంది సేవాపురస్కారాన్ని అందుకుంది.

చదువుకు చేయూత


అంతర్గాంలో తన గౌరవ వేతనం ఇస్తున్న సర్పంచ్

- పాఠశాలలో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- స్వచ్ఛందంగా విద్యావలంటీర్లను ఏర్పాటు చేస్తున్న దాతలు
- తీరుతున్న ఉపాధ్యాయుల కొరత
- పలు గ్రామాల్లో విద్యార్థుల చదువుకు తోడ్పాటు


పొన్నారి పాఠశాలలో బోధన చేస్తున్న విద్యావలంటీర్ మహేశ్వరి

తాంసి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నా.. పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలే ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు చదువులో ప్రతిభ కనబర్చాలని ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యాచరణ చేపడుతున్నప్పటికీ ఉపాధ్యాయుల కొరతతో లక్ష్యం నెరవేరడం లేదు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు సైతం పలువురు ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయల కొరత ఉన్న చోట పలువురు దాతలు విద్యావలంటీర్లను ఏర్పాటు చేసి వారికి వేతనం అందజేస్తూ విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తున్నారు.

పొన్నారి పాఠశాలలో..
మండలంలోని పొన్నారి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ హరీష్‌రెడ్డి ఈ విషయం తెలుసుకుని విద్యావలంటీర్‌ను ఏర్పాటు చేశాడు. ఈ పాఠశాలలో మొత్తం ఐదు తరగతులు నిర్వహిస్తుండగా 106 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. అమెరికాలో స్థిరపడిన హరీష్ రెడ్డి ఏడాదిగా విద్యార్థుల కోసం పాఠశాలలో గ్రామానికి చెందిన మహేశ్వరి అనే యువతిని విద్యావలంటీర్‌గా నియమించాడు. ప్రతి నెల రూ.5వేల గౌరవ వేతనం తన తండ్రి ఆనంద్ ద్వారా అందిస్తున్నాడు.


అంతర్గాంలో బోధిస్తున్న విద్యావలంటీర్ రజిత

వడూర్ పాఠశాలలో..
భీంపూర్ మండలంలోని వడూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో 90మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఈ ఏడాది పాఠశాల ప్రారంభం నుంచి పాఠశాలలో గ్రామస్తులు గ్రామాభివృద్ధి కమిటీ తరఫున ఇద్దరు గ్రామానికి చెందిన డిగ్రీ పూర్తిచేసిన అంకిత, శిరీషను విద్యావలంటీర్లుగా నియమించారు. వీరికి ప్రతినెలా గ్రామాభివృద్ధి కమిటీ తరఫున ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నారు.

అంతర్గాంలో...
భీంపూర్ మండలంలోని అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీకాంత్ గ్రామస్తుల సహకారంతో విద్యావలంటీర్‌ను నియమించాడు. పాఠశాలలో మొత్తం 114 మంది విద్యార్థులు ఉండగా కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఒక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై పంపించారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్యకు సరిపడా లేకపోవడంతో గ్రామస్తులు అంతా కలిసి పాఠశాలకు ఓ విద్యావలంటీర్‌గా రజితను ఆరు నెలల క్రితం నియమించారు. ఆమెకు గౌరవ వేతనం అందించడానికి పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్ తనవంతుగా రూ.5వేలు, గ్రామ సర్పంచ్ బక్కి లలిత రెండు నెలల తన గౌరవ వేతనం రూ.10వేలు, అదే విధంగా పాఠశాల పూర్వ విద్యార్థులు తల కొంత డబ్బులను పోగుచేశారు. జమచేసిన డబ్బుల్లోంచి విద్యావలంటీర్‌కు ప్రతినెలా రూ.3500 వేతనంగా అందిస్తున్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి


లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ, పశువైద్యాధికారులు

భైంసారూరల్: మండలంలోని కుంబి గ్రామ శివారులో చిరుతపులి దాడిలో లేగదూడ మృతిచెందింది. చుచుంద్ గ్రామానికి చెందిన రాజేశ్ అనే రైతు లేగదూడను కుంబి శివారులోని వ్యవసాయ పంటపొలంలో కట్టేసి ఉంచాడు. మంగళవారం ఉదయం రాజేశ్ పంటపొలానికి వెళ్లగా లేగదూడ మృతిచెంది కనిపించింది. దీంతో రాజేశ్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. అటవీశాఖ, పశు వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. లేగ దూడపై చిరుతపులి దాడిచేసిందని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. కుంబి, చుచుంద్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారి ఇర్ఫానోద్దీన్ సూచించారు.

పత్తి చోరీ

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలోని పంటచేనులో ఉంచిన పత్తి మూటలను సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. గ్రామానికి చెందిన రైతు సత్యనారాయణ తన పత్తిపంట చేనులో కూలీల ద్వారా తీసిన మూడు క్వింటాళ్ల పత్తిపంట మూటలను పంటచేనులో నిల్వ చేశాడు. నిల్వ చేసిన పత్తి మూటలను తీసుకురావడానికి మంగళవారం ఉదయం వెళ్లగా పంటచేనులో పత్తి మూటలు కన్పించలేదు. అలాగే మరో క్వింటాల్ కంది పంట సైతం ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన పత్తి విలువ దాదాపు రూ.30వేల వరకు ఉంటుందని రైతు వాపోయాడు.

27న పీఎఫ్ సమస్యలపై సదస్సు


మాట్లాడుతున్న పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్

నిర్మల్: పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) సమస్యల పరిష్కారం, అవగాహన కోసం ఈ నెల 27న నాలుగు జిల్లాల్లో ×నిధి ఆప్‌కే నిఖత్× పేరిట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రావిడెంట్‌ఫండ్ అసిస్టెంట్ కమిషనర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పీఎఫ్ సభ్యులు చిన్నపాటి కారణాలతోనే చాలారోజులుగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆధార్‌కార్డులో ఓ రకంగా, పీఎఫ్‌లో మరో రకంగా పేరు ఉండటం, ఒక్క అక్షరం అటు ఇటుగా ఉన్నా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అలాగే బీడీ కార్మికులకు పెళ్లైన తర్వాత ఆధార్‌కార్డులో భర్త పేరు, అంతకు ముందు పీఎఫ్‌లో తండ్రిపేరు రావడం సమస్యగా మారుతోందన్నారు. ఇలాంటి సమస్యలతో పాటు కంపెనీలు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడం వంటి సమస్యల పరిష్కారాల కోసం కృషి చేస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగానే ప్రతీ నెల 27న ×నిధి ఆప్‌కే నిఖత్× పేరిట ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. నిర్మల్‌లో స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఉంటుందని పీఎఫ్ సంబంధించి సమస్యలు ఉన్నవారు పరిష్కారం, అవగాహన కోసం రావచ్చని చెప్పారు. ఈ సమావేశంలో పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు కావాలి

- జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న చైర్మన్ రాథోడ్ జనార్దన్

బజార్‌హత్నూర్: ప్రతీ గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రతీ క్రీడాకారుడు సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని జాతర్ల గ్రామంలో నవజ్యోతి యూత్ క్లబ్ 46వ వార్షికోత్సవం సందర్భంగా అంతర్రాష్ట్ర క్రీడల ముగింపు కార్యక్రమంలో మాజీ ఎంపీ గొడం నగేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ మాజీ ఎంపీ గొడం నగేశ్ మాట్లాడారు. ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మా స్వగ్రామం జాతర్లలో నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించామని వివరించారు. జాతర్ల గ్రామంలో ఎంపీ నిధుల ద్వారా మినీ స్టేడియాన్ని నిర్మించామని, ప్రోకబడ్డీని తలదన్నేలా ఏర్పాట్లు చేసి 2016 జనవరి 7, 8, 9 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలు విజయవంతమయ్యామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రూ.2కోట్ల నిధులతో జాతర్ల గ్రామంలో 12 ఎకరాలలో కేంద్రీయ క్రీడా పాఠశాల ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్‌లో జాతీయస్థాయి గ్రామీణ క్రీడలను నిర్వహించగలమనే ధీమా వచ్చిందని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమం ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, గొడం చందన్, మడవి కృష్ణారావ్, ఆత్రం భాస్కర్, సహకార సంఘం చైర్మన్ మేకల వెంకన్న, సర్పంచ్‌లు లక్ష్మి నాగోరావ్, ఎంపీటీసీ పెందుర్ ఈశ్వర్, రాజేశ్వర్, ఆల్కె గణేష్, నానం రమణ, చిల్కూరి భూమన్న, లక్కం రాములు, కొత్త శంకర్, నందు, గోపాల్, గంగారాం, రవీందర్, కళ్యాణ్, వినోద్ పాల్గొన్నారు.

ఇంట్లో పాతిపెట్టిన గుడుంబా పట్టివేత


పొన్కల్‌లో గుడుంబాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

మామడ: గుడుంబాను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ అధికారులు వెళ్లి ఇంటిని ఎన్నిసార్లు వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేయగా ఇంటిలోపలి గదిలోని భూమిలో ప్లాస్టిక్ డ్రమ్ములను ఉంచి పైనుండి ఎవరికి అనుమానం రాకుండా సిమెంట్ స్లాబ్ వేసి అందులో నిల్వ చేసిన గుడుంబాను పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారుల వివరాల ప్రకారం... పొన్కల్ గ్రామానికి చెందిన తోకల సాయన్న ఇంటిలోని గదిలో గోతిని తవ్వి అందులో ప్లాస్టిక్ డ్రమ్ముల్లో గుడుంబా ప్యాకెట్లను నిల్వ చేసి ఉంచాడు. వాటిపై సిమెంట్ స్లాబ్ వేయించాడు. సిమెంట్ స్లాబ్‌పై బియ్యం బస్తాలను ఉంచి అవసరమైనప్పుడు తీసి విక్రయిస్తున్నాడు. ఎక్సైజ్ అధికారులు సిమెంట్‌ను తొలగించి భూమిలోపల నుంచి డ్రమ్ములను బయటకు తీశారు. అందులోని 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రాయదారి తండా, మామడతండా, పొన్కల్ గ్రామాల్లో గుడుంబా విక్రయ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించి 30 లీటర్లు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఒకరు పరారీలో ఉండగా మిగితా ఐదుగురు తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది ప్రకాష్, రవీందర్, భాస్కర్, రాజశేఖర్, నిరోష, రషీద్, ప్రకాష్, రవీందర్ పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు
నేరడిగొండ: నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆబ్కారీ శాఖ జిల్లా స్క్వాడ్ లక్ష్మణ్ రావ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రోల్ మామడ గ్రామంలో తనిఖీలు చేశారు. నోలే సరస్వతీ, రాయిచండ్‌ల వద్ద 40 లీటర్ల ఇప్ప పువ్వు పానకాన్ని ధ్వంసంచేశారు. 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

ఎనిమిది మంది యువకుల బైండోవర్

- తల్లిదండ్రులకు డీఎస్పీ కౌన్సెలింగ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎదుట ఘర్షణకు దిగిన ఎనిమిది మంది యువకులను వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ బైండోవర్ చేశారు. ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ ఎదుట మంగళవారం హాజరుపర్చారు. ఇటీవల ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ర్యాలీలో దాడులకు దిగిన యువకులు మరోసారి సోమవారం రాత్రి పోలీసుస్టేషన్ ఎదుట బాహాబాహికి దిగారు. దీంతో అజయ్, సాజన్, సృజన్, రవితేజ, భానుతేజ, శివరామకృష్ణ, రోషన్, సృజన్‌లపై కేసు నమోదు చేశారు. వీరికి ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా మరోమారు వ్యవహరిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బైండోవర్ అయిన యువకులపై ఆరు నెలల్లోపు మరోసారి ఏదైన కేసు నమోదైతే రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

చెరువులో యువకుడి గల్లంతు


చెరువులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు


భైంసారూరల్: తానూరు మండలం బోల్సా గ్రామానికి చెందిన లక్ష్మణ్(22) ఇలేగాం చెరువులో గల్లంతైనట్లు భైంసారూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... బోల్సా గ్రామానికి చెందిన లక్ష్మణ్, షేక్ హైమద్‌లు దేగాం గ్రామానికి వెళ్లాడు. అక్కడి నుంచి తిరుగుపయణంలో ఇలేగాం కొత్త చెరువు వద్ద స్నానానికి దిగి గల్లంతయ్యాడు. చెరువులో మునిగిన వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం చీకటి పడేవరకు చెరువులో గాలించిన ఆచూకీ లభించలేదు.

కుటుంబీకుల అనుమానం...
బోల్సా గ్రామం నుంచి షేక్‌హైమద్ అనే వ్యక్తితో లక్ష్మణ్ కలిసి వెళ్లాడని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. చెరువు వద్ద స్నానానికి వెళ్లితే బట్టలు, చెప్పులు ఒడ్డుపై ఎక్కడ కనిపించడం లేదని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మణ్ నీటిలో గల్లంతయ్యాడా... మరేమైనా జరిగి ఉంటుందా అనే విషయంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

- ఎంపీ సోయం బాపురావ్

ఆదిలాబాద్‌రూరల్: 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యే జోగు రామన్న, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినా హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఎంపీ సోయం బాపురావ్ విమర్శించారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ మోసాలను ఎండగట్టడమే బీజేపీ లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,000 బూత్ స్థాయిలలో కార్నర్ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో లాండసాంగ్వి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని గొప్పగా చెప్పినా ఎమ్మెల్యే రామన్న ఆ సమయంలో ఇచ్చినా హామీలను నేరవేర్చలేదని విమర్శించారు. అంతకు ముందు గ్రామానికి వచ్చినా వారికి డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపురావ్‌ను, పాయల్ శంకర్‌ను శాలువలుతో సత్కరించారు. బీజేపీ మండల నాయకులు భోజన్న, సంతోష్, విజయ్, మయూర్ చంద్ర ఉన్నారు.


ఎంపీ సోయం బాపురావ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆర్జీయూకేటీలో అకడమిక్స్‌పై సమీక్ష


ఆన్‌లైన్ సర్టిఫికెట్ సర్వీస్ ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ

భైంసా: బాసర ఆర్జీయూకేటీ కాన్ఫరెన్స్ హాల్‌లో అకడమిక్స్‌పై అధ్యాపకులతో డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ మంగళవారం సమీక్ష నిర్వహించారు. విద్యావిధానంలో మార్పులకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు అకడమిక్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు అధ్యాపకుల ఫీడ్ బ్యాక్, విద్యార్థుల హాజరును తప్పనిసరిగా చేయడం, సకాలంలో పరీక్షలు నిర్వహించి ఫలితాలు అందించడం చేయాలన్నారు. ఇప్పటివరకు ఫెయిల్ అయిన వారికి వన్ టైం చాన్స్ కింద అవకాశం కల్పించడం, 2020-21 విద్యార్థులకు 40 శాతం ఫీజు రాయితీ, పీయూసీ రెండేళ్లు పూర్తి చేసుకున్న విద్యార్థి ఇంజినీరింగ్ బ్రాంచ్ పొందాలంటే కచ్చితంగా 6 సీజీపీఏ కలిగి ఉండడం, విద్యార్థులకు, అధ్యాపకులకు క్యాంటీన్ ఏర్పాటుకు టెండర్, అధ్యాపకుల రెన్యువల్స్ తదితర అంశాలపై చర్చించామని వివరించారు. సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడుతూ భద్రత విషయంలో చేపట్టాల్సిన చర్యలపై సెక్యూరిటీ ఆఫీసర్ సీఐ రవీందర్ నాయక్, ఎస్సై రోహిణిని ఆదేశించారు. సమావేశంలో అసోసియేట్ డీన్స్ ఉన్నారు.

ఆన్‌లైన్ సర్టిఫికెట్ పోర్టల్ ప్రారంభం..
ఆర్జీయూకేటీలో ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడ్డ విద్యార్థుల కోసం ఆన్‌లైన్ సర్టిఫికెట్ సర్వీస్‌ను ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ ప్రారంభించారు. ఈ సర్వీస్ ద్వారా ఆర్జీయూకేటీ విద్యార్థులు రూ.250 పోస్టల్ చార్జీ చెల్లించి ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ పొందవచ్చని పేర్కొన్నారు. ఇతర దేశాల్లో ఉద్యోగం చేస్తున్న విద్యార్థులు రూ.2 వేలు చెల్లించాలని సూచించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, సీవోఈ వినోద్, అడిషనల్ సీవోఈ రామరాజు, సునీల్ ఉన్నారు.

అవస్థల్లో ఆస్పత్రి 'దారి'




నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. అత్యవసర చికిత్స కోసం ఈ రోడ్డులో రావాలంటే గుండెలు ఆగిపోయే పరిస్థితి నెలకొంది. నిత్యం ఎమర్జెన్సీ అంబులెన్స్‌లు ఇదే రోడ్డుపై రావాల్సి ఉంటుంది. ఈ రోడ్డులో ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. కంకరతేలి వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఇకనైనా రోడ్డు బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్